

గుమ్మళ్ళ భాస్కరరావు

# చెయ్యి విరిగింది

నా చెయ్యి విరిగింది.

దీనికి విరుగుడు లేదా అని డాక్టర్ దగ్గరికి వెళితే ... చేతికి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పోతపోసి, ఓ గుడ్డను మెడకు ఉయ్యాలకట్టి, దాన్లో నా చేతిని పెట్టి — పొమ్మన్నాడు.

నా కాలేజీ జీవితంలో రకరకాల ఆటలు ఆడేవాణ్ని – లాంగ్ జంపు, హైజంపు .. ఆ జంపూ, ఈ జంపూ ... అన్ని జంపులూ దూకేవాణ్ని. గోడలు కూడా దూకాను (?) అయితే అప్పుడు విరిగిందా ఈ చేయి? ఉహుఁ! కాలేజీ ఛాంపియన్ అయి కూర్చున్నప్పుడు ప్రిన్సిపాల్‌గారు నాకు షేక్‌హాండ్ ఇచ్చారు. అప్పుడూ? ఉహుఁ, విరగలేదు.

ఒకనాడు నేను ఊరవతల తోటలో షికారు కెళితే, ఇంతలో "రక్షించండి!" అనే కేకలు వినిపించాయి. ఒక రౌడీ ఒక అమ్మాయిని ఈడ్చుకుపోతున్నాడు సినిమాలోలాగా. "ఓరీ దుర్మార్గుడా! మర్యాదగా ఆమెను విడిచిపెట్టు." అన్నాను "అహ్హాహ్హా!" – నేనుకాదు, వాడు నవ్వాడు అలా. "నేను బక్కవాణ్ణి అని నిర్లక్ష్యం చేస్తున్నావా? కాసుకో," అని వాడిమీదికి దూకి, ఢిష్యూ ఢిష్యూమంటూ గుద్దులు గుద్దాను. వాడికీ నాకూ పెద్ద యుద్ధం జరిగింది అయితే. అప్పుడు విరిగిందా ఈ చెయ్యి? ఛ ఛ!

వాడు ఓడిపోయి వాడిపోయిన మొహంతో పారిపోయాడు. "మీ మేలు మరవలేనండీ!" అంది ఆ అమ్మాయి. "దానిదేముందిలే! నువ్వు వెళ్ళిపో," అని వెనక్కి తిరిగాను. ఆమె ఏడ్పు వినిపించింది హఠాత్తుగా. "మళ్ళీ ఏవిటి?" అన్నాను. "ఇంతేనా నా బ్రతుకు," అని కన్నీళ్ళు పెట్టుకొంది. "ఏవిటి సంగతి," అనడిగా. "మీకు ఫండమెంటల్సు తెలీనట్టుంది. హీరో హీరోయిన్ని రక్షించిన తర్వాత ఏం చేస్తాడు?" అంది. ఆశ్చర్యపడి "మైగాడ్! మే గాడ్ బ్లెస్ యూ! ప్రేమ," అన్నాను. ఆమె ప్రేమలో పడింది. తప్పదుగా! నేనూ పడ్డా – అయితే ఈ హస్తం అప్పుడు విరిగిందా? లేదు!

ప్రేమ అయింది, పెళ్ళీ అయింది. మరిన్ని అయ్యాక పిల్లలు పుట్టడం ఎలా ఆగుతుంది? పిల్లలు పుట్టి, ధరల్లాగ పెరిగారు. ఎలాగూ పెరిగారుకదా అని వాళ్ళకు కత్తియుద్ధం, కర్రయుద్ధం నేర్పాను. మరయితే మదీయ కరకమలము వాళ్ళవలన విరిగెనా? పాపం శమించుగాక! దేవుడు క్షమించుగాక!

మా ఆవిడకీ, నాకూ చాలా అభిప్రాయ భేదాలు వచ్చి, చిన్న తగాదాలు వస్తుండేవి. "భార్యా! భార్యా! నీ కిది భావ్యముకాదు. నీవు లేని నా బ్రతుకు బ్లేడులేని రేజరులాంటిది," అని నచ్చజెప్పినా పోట్లాటలు తప్పేవికావు. ఈ చెయ్యి ఆ సందర్భంలో విరిగిందా? – అసంభవం!

క్షమించాలి? అసలువిషయం చెప్పకుండా మిమ్మల్ని చాలారూట్లు తిప్పాను. చెయ్యి ఎలా విరిగిందో చెబుతున్నాను. విధి బలీయంగదా!

ఒక సాయంత్రం – అలవాటుప్రకారము షైరు కెళ్ళాను. మెయిన్‌రోడ్డుమీద పెద్ద ఊరేగింపుగా వెళ్తున్నారు, అంతా పెద్దగా అరుస్తున్నారు. అది దేనికి సంబంధించిన ఆందోళనో – నాకు తెలీదు.

"నశించాలి! డౌన్ డౌన్! మాకు వద్దు, మాకు వద్దు," అంటున్నారు

నేను ఊరేగింపుకి అడ్డంగా వెళ్ళి, నడ్డిమీద చేతులు పెట్టుకొని – "ఏంవాయ్! ఎందుకువద్దు?" అనడిగా. అంతే!

నా చెయ్యి విరిగింది.